**కామెడీ కథ**

**తలుపుకొట్టిన శబ్దం విని... నిద్రమంచం మీద నుండి లేచి వెళ్లి... భయపడుతూ తలుపుతీసాడు ప్రకాశం.**

**ఎదురుగా నరసింహం!**

**"హమ్మ! నువ్వట్రా సింహం!? అద్దె అడగదానికి వచ్చిన యజమాని పీనుగేమోన నుకుని హడలి చచ్చాను. దా.. లోపలికి" అంటూ లోపలికి వచ్చాడు ప్రకాశం.**

# సింహంగాడి దెబ్బ

చాపమీద పడుకున్న క్రొత్త వ్యక్తిని చూస్తూ..

''ఎవర్రా ప్రకాశం... ఆయన?'' అని అడిగాడు నరసింహం.

''మా కార్యాలయంలో నిన్ననే చేరిన గుమాస్తా. పేరు వంశీ. వేరే గది దొరికేదాకా నాతో పాటే ఉంటానంటే రమ్మన్నాను'' అంటూ వంశీ వైపు తిరిగి... ''వీడు నా చిన్ననాటి స్నేహితుడు. పేరు సింహం..నరసింహం! పేరు అలా వుంటుం దిగానీ మనసు వెన్నపూస'' అన్నాడు ప్రకాశం.

నమస్కార, ప్రతి నమస్కారాలు అయ్యాయి.

''ఏంట్రా!? ఇంత పొద్దున్నే తగలడ్డావ్!?'' ప్రకాశం అడిగాడు.

''సౌందర్య నన్ను పెళ్ళిచేసుకోవటానికి ఒప్పుకుందిరా!'' ఆనందంగా చెప్పాడు నరసింహం.

''చాలా సంతోషం. ముహూర్తాలు ఎప్పుడు పెట్టుకుంటున్నారు?'' అడిగాడు ప్రకాశం.

''వాళ్ళ నాన్న రెండు రోజుల్లో వస్తానన్నాడు'' నరసింహం జవాబు.

వీళ్ళ మాటలు వింటున్న వంశీకి ఏమీ అర్థం కాలేదు. సౌందర్య ఇతన్ని చేసుకోవటం ఏమిటి? ఇతనెలా తెలుసు ఆమెకి?

ఉండబట్టలేక అడిగేసాడు. ''నరసింహం గారూ! సౌందర్య అంటే పబ్లిక్ ఫిగర్. కాబట్టి అందరికీ తెలుస్తుంది. మరి మీ గురించి... ఆమె కెలా తెలుసు?''

నరసింహానికి-వంశీ.ఏం మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు. 'పబ్లిక్ ఫిగర్ ఏమిటి..? బోడి ఆంగ్లభాష..వీడూను..అసలు సౌందర్య గురించి వీడికెలా తెలుసు? కాస్త సీరియస్‌గా అదే విషయాన్ని అడిగాడు..వంశీని.

వంశీకి అంతా అయోమయం అయి తెల్ల మొహం వేశాడు.

ప్రకాశానికి పరిస్థితి అర్థం అయింది ''సౌందర్య అంటే సినిమా యాక్టర్ కాదు వంశీ..వీడు పెళ్లిచూపులు చూసిన అమ్మాయి'' అన్నాడు.

''సారీ! నాకు తెలీక అలా మాట్లాడానండీ. చిన్న మిస్టేక్ జరిగిపోయింది'' అన్నాడు వంశీ.

''సారీ... ఏంటి? మిస్టేక్ ఏంటి? మీరు పుట్టుకతో తెలుగువాళ్ళు కాదా!? ఇందాక కూడా పబ్లిక్ ఫిగర్ అని ఉపయోగించారు'' కోపంగా అన్నాడు నరసింహం.

''నేను నార్మల్‌గా ఉపయోగించే వర్డ్స్ అవి'' అన్నాడు వంశీ.

''మళ్లీ ఆంగ్లభాష... ఏం..వీటన్నింటికి తెలుగు పదాలు లేవా, ఉపయోగించటానికి?'' సీరియస్ అయ్యాడు నరసింహం.

వంశీ కూడా సీరియస్‌గా- ''నేనన్నదాంట్లో తప్పేముంది? కామన్‌గా అందరూ యిలాంటి పదాల్నే 'యూజ్' చేస్తూవుంటారు. అయినా నేను ఇంగ్లీషు లిటరేచర్ చేసిన వాడిని. తెల్సా!'' అన్నాడు.

నరసింహం, ఉగ్ర నరసింహం అయ్యాడు. అది గమనించిన ప్రకాశం ''నీ గురించి వంశీకి తెలియదు కదరా సింహం... అందుకే అలా మాట్లాడాడు'' వాతావరణాన్ని శాంతింపజేయటానికి ప్రకాశం చూస్తున్నాడు.

''వంశీ! మా వాడికి తెలుగు భాషంటే వల్లమాలిన అభిమానం. ఆంగ్లపదాలు వాడే వాళ్లంటే వాడికి పరమ అసహ్యం. నేను వాడితో మాట్లాడే టప్పుడు కూడా అన్నీ తెలుగు పదాలే ఉపయోగిస్తూ వుంటాను'' ప్రకాశం ఇంకా ఏదో చెప్పబోతూ వుంటే...

''నన్నేం చేయమంటారు? నేను అన్నదాంట్లో ఏదన్నా 'రాంగ్' వుంటే..ఆయన నన్ను అనాలి. అయినా నేను 'సారీ' చెప్పాను కదా!'' - వంశీ కోపంగా, అసహనంగా అన్నాడు.

''వంశీ! మర్యాద దక్కదు..మళ్లీ మళ్లీ ఆంగ్ల పదాలు ఉపయోగిస్తున్నావ్!'' అదే సీరియస్‌గా అన్నాడు నరసింహం.

''వంశీ! మావాడి జోలికి పోకు. వాడు ఒకే కంలో 'మెంటల్ బ్యాలెన్స్' తప్పాడంటే వాడిని ఆపగల శక్తి ఇక ఈ ప్రపంచంలో ఎవ్వరికీ లేనట్లే..'' పొరపాటున ఇంగ్లీషు మాటలు వాడుతూ అన్నాడు ప్రకాశం.

''ఏంటిరోయ్! నువ్వు కూడా...'' నరసింహం మాట్లాడుతూ ఉండగానే.

''అబ్బాయ్! ప్రకాశం ఏంటీ పైన అరుపులు?'' ఇంటి ఓనర్‌గారి గొంతు వినబడింది.

ప్రకాశం హడావుడిగా క్రిందకు వెళ్లాడు ఓనర్ గారిని మంచి చేసుకోవటానికి. అసలే ఈమధ్య రూమ్ ఖాళీ చేయాలని అంటున్నాడు కూడా.

ఇక రంగంలో యిద్దరే మిగిలారు. ఇంగ్లీషు వంశీ. తెలుగు నరసింహం.

అలవాటు కొద్దీ- వంశీకి ఎక్కడెక్కడివో ఇంగ్లీషు పదాలు మాటల్లో దొర్లిపోతున్నాయి. ఒక్కొక్క మాటకూ నరసింహం తోకతొక్కిన త్రాచులాగా అవుతున్నాడు.

నరసింహం కంట్రోల్ తప్పుతున్నాడు. కాళ్ళు ఒణకటం, మాటలు తడబడటం, కోపంతో ఊగిపోవటం వంటి లక్షణాలు కనబడుతున్నాయ్.

''ఇంగ్లీషు భాష క్లుప్తంగా వుంటుంది. సామెతల్ని ఇంగ్లీషులో చెప్పినంత సుందరంగా తెలుగులో చెప్పమనండి ఎవరైనా..తెలుస్తుంది!'' వంశీ ఇలా అనేసరికి - నరసింహం ఇక జూలు విదిల్చాడు. కాలు దువ్వాడు. తను మాట్లాడే మాటల మీద పూర్తిగా బ్యాలెన్స్ కోల్పోయాడు.

''ఏ పాములో ఏ పుట్ట వుందో? దీనికి ఆంగ్లం ఏమి చెబుతుంది?-'' నరసింహం తత్తరపాటుకి పరాకాష్ఠ ఇది. సామెతల్ని తిరగేసి చెబుతున్నాడు.

వంశీకి దానిలో వున్న తిరకాసు ముందు అర్థం కాలేదు.


''ఏ పన్ను అయితేనేం..రాళ్లు ఊడ గొట్టుకోవటానికి'' వణుకుతూనే అన్నాడు నరసింహం.

వంశీ ఆలోచనలో పడ్డాడు. ''సామెతలో ఏదో తేడా కనబడుతోంది. ఏమిటి... ఆ... అర్థం అయింది''

పూర్తిగా అర్థం చేసుకున్న వంశీ, విచిత్రంగా నరసింహం వంక చూసాడు.

నరసింహం సామెతల్ని తప్పుల తడకలుగా అలవోకగా మాట్లాడేస్తున్నాడు.

''ప్రాణం రాకడ..వాన పోకడ..ఎవడు చెప్పగలడు? తాడుని చూసి తాడను కోకు..పాముని



చూసి
పామనుకోకు! రోకలి కుట్టింది.
తలకి పిచ్చిని చుట్టమన్నాట్ట'

వంశీకి పిచ్చి చూపులు పడ్డాయి. నోట మాట ఆగిపోయింది. మెదడు మొద్దుబారిపోయింది. గొంతు పిసికేస్తుంటే..ఊపిరాడని భావన.

ఓనర్‌తో మాట్లాడి పైకి వచ్చిన ప్రకాశానికి పరిస్థితి పూర్తిగా అర్థం అయింది. కంగారు పడ్డాడు. ఎవరిని వారించాలన్నా, యిద్దరూ స్పృహలో లేరు.

నరసింహం సామెతల ప్రవాహంలో-వంశీ మౌనంగా కొట్టుకుపోతున్నాడు.

''పులుపు చచ్చినా..చింత చావదు''

''మగాడు తిరిగి చెడ్డాడు..ఆడది తిరక్క చెడుతుంది''

''నక్కను చూసి..పులి వాత పెట్టుకున్నట్లు''

''కూత కొంచెం..పిట్ట ఘనం..''

వంశీ తట్టుకోలేకపోయాడు. వెనక్కు విరుచుకు పడిపోయాడు.

ప్రకాశం కంగారుగా..వంశీ వద్దకు వెళ్లి, కదిల్చి చూసి లాభం లేదనుకుని మొహాన నీళ్లు చల్లాడు.

ఊహూ.. లేవలేదు. సింహంగాడి దెబ్బా..మజాకా?

నరసింహం సామెతల జోరు ఆగలేదు.

''ఇంటి పేరు గబ్బిలాల వారు..ఇంట్లో కస్తూరి కంపు''

''పేరు దిబ్బ..ఊరు గొప్ప''

''ఊరు మంచిదైతే..నోరు మంచిదౌతుంది''

నరసింహం వూగిపోతున్నాడు. కళ్లు మూసుకునే మాట్లాడుతున్నాడు.

''ఒరే సింహం ఆపరా! నేనంటే అలవాటు పడ్డ ప్రాణాన్ని. వంశీ కొత్తవాడురా. వాడి జీవితాన్ని అన్యాయం చెయ్యకు'' ప్రకాశం పెద్ద గొంతుకతోనే అరిచాడు.

నరసింహం ఆపలేదు.

''కలిమి కావడులు..లేమి కుండలు''

''ప్రధానమే..నిధానం''

ప్రకాశం..నరసింహం చెంపని ఛెళ్ళుమనిపించాడు. ప్రకృతి స్థంభించిపోయింది. మొదలు నరికిన చెట్టులాగా మంచం మీద పడిపోయాడు నరసింహం.

ప్రకాశం కంగారుగా గ్లాసుడు నీళ్లు సింహం మొహాన చిలకరించాడు. ప్రయోజనం లేకపోయింది.

ప్రకాశం బయటకు వచ్చి, ఓనర్‌గారిని పైకి కేకవేసి పరిస్థితిని వివరించాడు.

''ఎందుకైనా మంచిది, పోలీస్ రిపోర్టు ఇస్తాను. ఇది హత్యానేరం క్రిందకు వస్తుందేమో'' అన్నారు ఓనర్‌గారు.

ప్రకాశానికి మరీ భయం పట్టుకుంది. ముచ్చెమటలు పోసాయి.

**యం.యస్.శాయిబాబు**

''వీళ్లిద్దరూ కలిసి..నా [?]కల మీదకు తెస్తున్నారే. వీళ్ళ దుంపతెగ. మందు హాస్పిటల్‌కు తీసుకెళ్తాను'' అనుకుంటూ ఆటోకోసం బయల్దేరాడు ప్రకాశం.

★ ★ ★

పరీక్ష చేసిన డాక్టర్..''ప్రాణాలకు ప్రమాదం లేదు'' అని చెప్పిన తర్వాత ఊపిరి పీల్చుకున్నాడు ప్రకాశం.

మర్నాడు ఉదయం ముఖంగా నరసింహం స్పృహలోకి వచ్చాడు.

''ఐయామ్ థర్స్‌టీ! ప్లీజ్ గివ్‌మీ ఎ కప్ ఆఫ్ వాటర్!'' నరసింహం అడిగాడు.

ప్రకాశం నీళ్ళందిస్తూ- 'వీడు ఇంగ్లీషు మాట్లాడుతున్నాడేంటి?' అని విస్తుపోయాడు.

ప్రక్క బెడ్ మీదున్న వంశీ చూస్తూ..

''హూ ఈజ్ హి? వాట్ హాపెండ్ టు హిమ్!?'' అన్నాడు నరసింహం.

ప్రకాశం అనుమానంగా చూడసాగాడు నరసింహం వంక. వాడి విపరీత ధోరణిని జీర్ణించుకోలేకపోతున్నాడు.

ఈలోపు వంశికి స్పృహ వచ్చింది. ''ప్రకాశంగారూ బాగున్నారా!'' అని అడిగాడు.

''నాకేమైంది? బాగానే వున్నానే. నీకెలా వుంది?'' అడిగాడు ప్రకాశం.

ఇంతలో ఒకాయన లోపలికి వస్తూ..''నరసింహంగారెక్కడ?'' అని అడిగాడు.

మంచం మీద నుండి లేచి నిలబడి వున్న నరసింహాన్ని చూడగానే ''ఇప్పుడెలా వుందండి?'' అని అడిగాడు.

ప్రకాశానికి ఆయనెవరో అర్థం కాలేదు. అదే ముక్క ఆయన్ని అడిగితే..''నేను సౌందర్య తండ్రినండీ! ముహూర్తాల కోసం వాళ్లింటికి వెళితే...మీ రూమ్‌కి వచ్చాడని చెబితే అక్కడకు వెళ్లాను. మీ రూమ్ ఓనర్‌గారి ద్వారా విషయం తెలుసుకుని ఇక్కడకు వచ్చాను.

'ఓ..మైడియర్ అంకుల్! వాటే సర్‌ప్రైజ్ విజిట్'' అంటూ సౌందర్య తండ్రిని రెండు చేతుల్తో ఎత్తుకుని గాల్లోకి తిప్పుతూ మాట్లాడుతున్నాడు నరసింహం.

ప్రకాశానికి కాళ్ళు ఒణికాయి, ఆ ముసలాయన్ని ఎక్కడ పడేస్తాడోనని.

నరసింహం..ఆయన్ని మెల్లగా క్రిందకు దించగానే ఆయన గుండె పట్టుకుని..మంచం మీద కూర్చుంటూ-

'వీడి దుంప తెగ. ఇంకా కాస్సేపు గిరగిరా తిప్పి వుంటే గుండాగి చచ్చేవాణ్ణి'' అని రొప్పుతూ- ''బాబోయ్. వీడి పిచ్చి బలం వీడను. బతికుంటే బలుసాకు తింటాను. మా సౌందర్యకి పెళ్లి కాకపోయినా ఫర్వాలేదు'' బయటకు పరుగు పరుగున వెళ్లిపోయాడు..సౌందర్య తండ్రి.

'వాటే వండర్! చూడు, చూడు..ఆ ముసలాడి పిక్క బలం. ఏవైనా లేహ్యాలు గట్రా మింగుతున్నాడేమో కనుక్కో. మనమూ వాడదాం!''

ప్రకాశం భుజం మీద చెయ్యి వేస్తూ అడిగాడు నరసింహం.

ప్రకాశానికి జీవితంలో మొట్ట మొదటిసారి 'గుండె వణికినట్లుగా' అనిపించింది.

నిస్తేజమైన చూపుల్తో నరసింహం వంక చూస్తున్నాడు.

''ఎందుకైనా మంచిది. ఒకసారి డాక్టర్‌ని పిలిపిస్తే చూస్తారుగా'' అనుకుంటూ అటుగా వెళ్తున్న నర్స్‌ని.. ''సిస్టర్'' అని పిలిచాడు ప్రకాశం. ఆమె లోపలికి వచ్చింది.

ఇంతలో వంశీ, ప్రకాశం దగ్గరకు వచ్చి-

''ప్రకాశంగారూ! నాకు ఒక చిన్న అనుమానం. మనం చంద్రుణ్ణి..'చందమామ' అంటున్నాం కదా. మరి సూర్యుణ్ణి- 'సూర్యబాబాయ్' అని కూడదా?'' అన్నాడు.

ప్రకాశం పిచ్చి చూపుల్తో వంశీ వంక చూసాడు. వీళ్ళ మాటలు, ప్రకాశం పిచ్చి చూపుల్ని గమనించిన నర్స్ భయంతో బయటకు పరుగు తీసింది. ఎదురుగా వస్తున్న డాక్టర్‌ని చూసుకోక..డాషిచ్చి కిందపడిపోయింది.

డాక్టర్‌కి అర్థంకాక, కంగారుగా లోపలికి వచ్చి- ''ఏమైంది?'' అని ప్రకాశాన్ని అడిగాడు.

ప్రకాశం..అవే పిచ్చి చూపుల్ని శూన్యంలోకి విసురుతూ-

''ఇక్కడకు ఆటోలో వస్తుంటే-నా మెదడు ఎక్కడో పడిపోయినట్లు అనుమానంగా వుంది. ఎందుకంటే నా మోకాలు ఖాళీగా అనిపిస్తోంది. కాస్త పరీక్ష చేయండి'' అంటూ కాలుని డాక్టర్‌గారి ముందుకు చాపాడు ప్రకాశం.

గది బయట క్రింద పడ్డ నర్స్, మెల్లగా గోడను పట్టుకు లేవబోతుంటే.. గదిలో నుండి- 'కెవ్వు' మన్న కేక వినబడింది. ఆ గొంతు 'డాక్టర్‌గారిది'. నర్స్ ఆ గొంతును గుర్తుపట్టి..కళ్లు తేలేసి గోడవారగా కూలబడిపోయింది.

*



**సర్కస్**

**నాట్ ఏ సర్కస్ ఫీట్. జస్ట్ ట్రాన్స్‌పరెంట్ డ్రెస్. ఫర్ కెమెరా షూట్స్.**

-లతాశ్రీనివాస్